క్లుప్తంగా

సీఎం సహాయ నిధి నుంచి రూ.2 లక్షల సాయం



మృతుడి భార్యకు చెక్ అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: పట్టణంలోని 21వ వార్డుకు చెందిన కాసాని ఏసు కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.రెండు లక్షలు మంజూరయ్యాయి. ఈ మొత్తానికి చెక్‌ను హోం మంత్రి తానేటి వనిత బుధవారం సాయంత్రం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారు భార్య కాసాని పద్మకు అందజేశారు. పద్మ భర్త ఏసు లారీ డ్రైవర్. పట్టణంలోని హెచ్‌పీ బంక్ సమీపంలో జూలై 5న లారీకి వాటర్ సర్వీసింగ్ చేస్తుండగా విద్యుత్తు షాక్‌కు గురై మృతి చెందారు. ఆధారం లేని తమ కుటుంబాన్ని ఆదుకోవాలని పద్మ పెట్టుకున్న అర్జీ మేరకు ప్రభుత్వం ఈ ఆర్థిక సహాయం చేసింది. కార్యక్రమంలో కౌన్సిలర్ పతివాడ నాగమణి, మాజీ కౌన్సిలర్ పతివాడ రామారావు, కౌన్సిలర్ మద్దిపట్ల సాయి గీత తదితరులు పాల్గొన్నారు.

హేమమాధురికి ఘన సన్మానం



హేమమాధురిని సన్మానిస్తున్న జూనియర్ కళాశాల యాజమాన్యం

దేవరపల్లి: ఇటీవల దక్షిణాఫ్రికాలో నిర్వహించిన అండర్- 23 ప్రపంచ కప్ టెన్నికాయిట్ జూనియర్స్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన జి.హేమమాధురిని స్థానిక ఆనంద్ ఎడ్యుకేషనల్ జూనియర్ కళాశాల యాజమాన్యం బుధవారం సన్మానించింది. హేమమాధురి ఆ కళాశాల పూర్వ విద్యార్థిని. కరస్పాండెంట్ డి. సువర్ణరాజు, అధ్యాపకులు ఆమెను సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ డి.ఆనంద్ ప్రసాద్, ప్రిన్సిపాల్ బీడీఎస్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంత మార్కెట్ వద్ద అగ్ని ప్రమాదం

నిడదవోలు: పట్టణంలోని సంత మార్కెట్ వెనుక గల రాయల వారి చెరువులోని జమ్ము గడ్డికి బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. మంటల దట్టంగా వ్యాపించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సమాచారం అందుకున్న స్థానిక ఫైర్ స్టేషన్ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు.

నేడు తిరుగుడుమెట్టలో సరఫరా నిలిపివేత

తాళ్లపూడి: విద్యుత్తు లైన్ల నిర్వహణ కోసం మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామంలో గురువారం ఉదయం 09.30 నుంచి సాయంత్రం 04.30 గంటల వరకూ సరఫరాను నిలుపుదల చేస్తామని ట్రాన్స్‌కో ఏఈ సీహెచ్ వెంకటరావు బుధవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేకాడుతున్న 15 మంది అరెస్టు

పెరవలి: మండలంలోని కాపవరం- పెరవలి గ్రామాల సరిహద్దుల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. పేకాడుతున్న 15 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.22,290 నగదు స్వాధీనం చేసుకున్నామని పెరవలి ఎస్‌ఐ ఎం.సూర్య భగవాన్ తెలిపారు. అరెస్టు చేసిన వారిని గురువారం కోర్టులో హాజరు పరుస్తామని ఆయన తెలిపారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల అందజేత

కొవ్వూరు: దివ్యాంగులకు రెండు ట్రై మోటార్ సైకిళ్లు అందజేశారు. స్థానిక శ్రీరామా సొసైటీ అధ్యక్షుడు, 15వ కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర పుట్టిన రోజు సందర్భంగా బుధవారం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత చేతుల మీదుగా వాటిని ఇద్దరు వికలాంగులకు అందజేశారు. మంత్రి ఈ సందర్భంగా శ్రీనివాస రవీంద్ర, రష్మిత దంపతులకు పూలమాల వేసి సత్కరించారు.అనంతరం మంత్రి సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు.జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడు నగ్గల్లపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాపవరంలో గృహ మహోత్సవం

కొవ్వూరు: మండలంలోని కాపవరం జగనన్న కాలనీలో గురువారం భారీ ఎత్తున గృహ మహోత్సవం నిర్వహిస్తారు. జిల్లాస్థాయిలో ఉదయం పది గంటలకు ఈ గ్రామంలోని జగనన్న కాలనీలో గృహ మహోత్సవం (గృహాల ప్రారంభోత్సవం) నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ బుధవారం తెలిపారు. హోం మంత్రి తానేటి వనిత, ఎంపీ భరత్‌రామ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, కలెక్టర్ మాధవీలత హాజరు కానున్నట్టు ఆయన తెలిపారు.

రైతన్నా! ఈకేవైసీ అయ్యిందా..

- ఈ నెల 13తో ముగుస్తున్న నమోదు గడువు
- డివిజన్‌లో 97.56 శాతం పూర్తయిన ఈకేవైసీ
- 99.47 శాతం పూర్తయిన ఈ క్రాప్ బుకింగ్



కొవ్వూరు మండలం కాపవరంలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

కొవ్వూరు: ప్రభుత్వం అందించే సబ్సిడీలు, పెట్టుబడి సాయం పొందాలంటే రైతులు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలి. తాము పండించిన పంటకు ఈ-క్రాప్ నమోదుతో పాటు ఈకేవైసీ చేయించాలి. తద్వారా ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టపోతే పరిహారం పొందే అవకాశం ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే పెట్టుబడి సాయం పొందాలంటే గడువులోగా ఈకేవైసీ చేయించుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం పొందే అవకాశం ఉండదని అధికారులు హెచ్చరిస్తున్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, వైఎస్సార్ రైతు భరోసా పథకాల ద్వారా ఏటా రైతులకు రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్నారు. ఈ మొత్తంలో కేంద్రం రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500 భరిస్తున్నాయి. ఈ సొమ్మును ఏడాదిలో మూడు విడతలుగా రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నారు.

కొవ్వూరు డివిజన్‌లో ఇదీ పరిస్థితి

ప్రస్తుత ఖరీఫ్‌లో కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో మొత్తం 88,113 హెక్టార్లలో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకూ 99.47 ఆయకట్టులో పండించే పంటలకు ఈ-క్రాపు బుకింగ్ పూర్తి చేశారు. అంటే 87,653.87 హెక్టార్లలో ఇప్పటి వరకూ ఈక్రాప్ పూర్తయ్యింది. డివిజన్‌లో 97.56 శాతం రైతులు ఈకేవైసీ చేయించుకున్నారు. ఇప్పటివరకూ డివిజన్‌లోని పెరవలి, దేవరపల్లి, నిడదవోలు, తాళ్లపూడి, గోపాలపురం మండలాల్లో నూరు శాతం ఈ క్రాప్ పూర్తి చేశారు. కొవ్వూరు, నల్లజర్ల మండలాల్లో 99.99 శాతం పూర్తయ్యింది.

డివిజన్‌లో మండలాల వారీగా ఈకేవైసీ, ఈ-క్రాప్ నమోదు శాతం

మండలం	ఖరీఫ్‌సాగు	ఈ క్రాపు	శాతం	ఈకేవైసీ	శాతం
పెరవలి	7417	7416.8	100	7087.05	95.55
చాగల్లు	7941	7742.48	97.50	7479.64	96.61
దేవరపల్లి	8193	8192.69	100	7921.66	96.69
నిడదవోలు	16494	16494	100	16091.62	97.56
కొవ్వూరు	10135	10134.07	99.99	9965.19	98.33
నల్లజర్ల	8143	8142.37	99.99	8049.98	98.87
తాళ్లపూడి	9049	9048.88	100	8987.51	99.32
గోపాలపురం	9386	9385.91	100	9338.34	99.49
ఉండ్రాజవరం	11355	11096.67	97.72	11043.01	99.51
మొత్తం	88,113	87,653.87	99.47	85,964	97.56

మరో రెండు రోజులే గడువు



ఈ నెల 13తో ఈకేవైసీ, ఈ-క్రాప్ నమోదు గడువు ముగుస్తోంది. వాస్తవానికి ఈ నెల 12వ తేదీతోనే గడువు ముగిసిపోతుంది. రైతుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని మరో రోజు పొడిగించాం. గ్రామ సచివాలయాలు, మీ సేవ కేంద్రాల్లో రైతులు ఈకేవైసీ చేయించుకోవచ్చు. ఇప్పటికే కొవ్వూరు డివిజన్‌లో 99.47 శాతం ఈ క్రాప్, 97.56 శాతం ఈకేవైసీ పూర్తిచేశాం.అందుబాటులో లేని రైతులు తమ సన్నిహితుల ద్వారా ఆధార్, సెల్ నంబర్లు తెలియజేసి అనుసంధానం సమయంలో ఓటీపీ నంబర్ చెప్పి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలి.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయాధికారి

సంక్షేమ పథకాలే జగనన్నకు శ్రీరామరక్ష



తాళ్లపాలెంలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీరామరక్షగా నిలుస్తాయని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని తాళ్లపాలెంలో బుధవారం ఆయన గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు సింగులూరి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు గంధం వెంకటరత్నం (షావుకారు), ఎంపీటీసీ సభ్యుడు బయ్యే కృష్ణబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, గ్రామంలో నాలుగున్నరేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలు వివరించే బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అర్హులకు ఇళ్లస్థలాలు ఇస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఉప సర్పంచ్ గంధం చంటిబాబు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యల పరిష్కారం

- ఇది జగన్ ప్రభుత్వానికే సాధ్యం
- హోం మంత్రి తానేటి వనిత
- వేగేశ్వరపురంలో తాళ్లపూడి మండల స్థాయి 'జగనన్నకు చెబుదాం'
- కలెక్టర్ మాధవీలతతో పాటు పలువురు జిల్లా అధికారుల హాజరు



తాళ్లపూడిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న హోం మంత్రి వనిత, కలెక్టర్ మాధవీలత

తాళ్లపూడి: గతంతో ఎప్పుడూ లేని విధంగా జగనన్న ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి గడపకూ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తోందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. జగన్నకు చెబుదాం మండల స్థాయి కార్యక్రమాన్ని బుధవారం వేగేశ్వరపురంలోని కాకర్ల రామయ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత, జిల్లా కలెక్టర్ కె.మాధవీలతలు జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల సమస్యలను ఓపిగ్గా విని వారికి సమాధానాలు చెప్పారు. సమస్యలకు పరిష్కారం కోరుతూ ప్రజల నుంచి 100 ఫిర్యాదుల అందాయని అధికారులు తెలిపారు.

ఇవీ సమస్యలు..

తాళ్లపూడి పంచాయతీ పరిధిలోని కుకునూరు గ్రామ పొలాలకు వెళ్లే జిల్లా పరిషత్ రోడ్డును, కాలువ గట్టు రోడ్డును అభివృద్ధి చేయాలని, వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకం నిర్వహణ కమిటీని మార్చాలని, పెద్దేవంలో చెరువు పూడిక తీయించాలని, పెద్దేవం ఎస్సీ కమ్యూనిటీని అభివృద్ధి చేయాలని ఫిర్యాదు చేశారు. అలాగే పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయాలని పలువురు సర్పంచులు కోరారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పలువురు వినతులు అందించారు.

వారం రోజుల్లో పరిష్కారం

ప్రజల నుంచి అందిన అర్జీలపై మంత్రి తానేటి వనిత స్పందించారు. అర్హత కలిగిన ఫిర్యాదులు అన్నింటినీ వారం రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ప్రజల అవసరాలు తెలుసుకునేందుకు మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వచ్చిన ఫిర్యాధులను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి రాలేని వారి సమస్యలను మండల స్థాయిలోనే జిల్లా అధికారుల సమక్షంలో పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, అసిస్టెంట్ కలెక్టర్ యస్వంత్ కుమార్, డీఆర్వో నరసింహులు, కొవ్వూరు ఆర్డీవో మల్లిబాబు, జిల్లా వ్యవసాయాధికారి మధుసూదనరావు, డీఈవో ఎస్. అబ్రహం, డ్వామా పీడీ పి.జగదాంబ, హౌసింగ్ పీడీ పరశురామ్, ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ టి.రాధిక, పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, మండల నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాలకూ మేలు

- హోం మంత్రి తానేటి వనిత
- ఐ.పంగిడిలో గడప గడపకూ..



మహిళకు బుక్‌లెట్ అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారానే అన్ని వర్గాల ప్రజలకూ మేలు చేకూరుతుందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. 140 రోజు బుధవారం రాత్రి ఐ.పంగిడి పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి మంత్రి వనిత ఇంటింటికీ వెళ్లి గత నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ చేకూరిన లబ్ధిని లెక్కలతో సహా వివరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. దారి పొడవునా ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, సర్పంచ్ గోశాల నాగార్జున, ఉప సర్పంచ్ ఉప్పులూరి వెంకట ఫణికృష్ణారావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, ఎంపీటీసీ సభ్యులు కోనాల భవాణి, కామన రత్నాజీ, మాజీ సర్పంచ్ కోమటి కృష్ణంరాజు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఇద్దరు ఎంపిక



ద్వితీయ స్థానం సాధించిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వాలీబాల్ జట్టు

కొవ్వూరు: స్కూల్ గేమ్స్ అండర్ -17 బాలుర జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. చాగల్లు మండలం మార్కొండపాడు నుంచి యు.రాజు, యలమంచిలి నుంచి ఎం.సునీల్ ఎన్నికైన వారిలో ఉన్నారు. ఈ నెల ఆరు నుంచి తొమ్మిదో తేదీ వరకూ కడప జిల్లా మైదుకూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించింది. విశేష ప్రతిభ కనబరిచిన ఈ జట్టులోని యు.రాజు, ఎం.సునీల్‌లు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 30 నుంచి శ్రీనగర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో వారిద్దరూ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. వారికి కోచ్‌గా మండలంలోని ధర్మవరం హైస్కూల్ పీడీ రాపాక సురేష్, అసిస్టెంట్ కోచ్‌గా కేఆర్ పురం పీఈటీ టి.వెంకటేష్ వ్యవహరించారు. జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి డి.రాజేంద్ర ప్రసాద్ పీఈటీలు, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన వాలీబాల్ జట్టును అభినందించారు.

దైవ దర్శనానికి వెళ్తూ అనంతలోకాలకు..

బిట్రగుంట: మితిమీరిన వేగంతో వస్తున్న పార్సిల్ లారీ ఆగి ఉన్న లారీని ఢీకొని పక్కనే విశ్రాంతి తీసుకుంటున్న భక్తులపైకి దూసుకెళ్లిన ఘటన బోగోలు మండలం కడనూతల వద్ద బుధవారం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఇద్దరు భక్తులు మృతి చెందారు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లా నిడమర్రుకు చెందిన సుబ్బరాజు (65), తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వేమలూరుకు చెందిన రామానాయుడు (65) గోవిందమాల ధరించి కాలినడకన తిరుమలకు ఈ నెల ఆరున బయల్దేరారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం నాలుగు గంటల ప్రాంతంలో కడనూతలకు చేరుకున్నారు. రోడ్డు పక్కనే చెట్ల నీడన ఉన్న కంకర మిక్సర్ లారీ పక్కన విశ్రాంతి తీసుకోసాగారు. ఈ సమయంలో చెన్నై నుంచి ఒంగోలుకు మితిమీరిన వేగంతో వెళ్తున్న పార్సిల్ లారీ అదుపు తప్పి తొలుత కంకర మిక్సర్ లారీని ఢీకొని, పక్కనే విశ్రాంతి తీసుకుంటున్న ఇద్దరు భక్తులపైకి దూసుకెళ్లింది. అప్పటికీ వేగం అదుపులోకి రాకపోవడంతో రోడ్డు పక్కనే ఉన్న ఐరన్ మెష్‌ను ఢీకొని నిలిచిపోయింది. ప్రమాదంలో సుబ్బరాజు, రామానాయుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- చెరువుల్లో చేప పిల్లలను విడిచి పెట్టిన ఎమ్మెల్యేలు



యర్నగూడెం గండి చెరువులో చేప పిల్లలను విడిచి పెడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



తాడిమళ్ల ఆవ చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, జాలర్లు

దేవరపల్లి: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా యర్నగూడెంలోని నీటిపారుదల శాఖకు చెందిన గండి చెరువులో బుధవారం 15 వేల చేప పిల్లలను ఎమ్మెల్యే విడిచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల జీవన భృతికి, జీవన ప్రమాణాల పెంపునకు ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లోని మత్స్యకార సహకార సంఘాలకు 42 వేల చేప పిల్లలను సబ్సిడీపై అందించామన్నారు. కార్యక్రమంలో ఫిషరీస్ అసిస్టెంట్ డైరెక్టర్ షేక్ దిల్ షాద్, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఆయిల్ పామ్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఉప సర్పంచ్ నరహరిశెట్టి దొరబాబు, ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణవేణి, అసిస్టెంట్ శాంతి, యర్నగూడెం ఫిషరీస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

మత్స్య సంపద పెంపునకు ప్రభుత్వం కృషి

నిడదవోలు రూరల్: చేప పిల్లల పెంపకంతో మత్స్యకారుల జీవన ప్రమాణాలను పెంచడంతో పాటు మత్స్య సంపదను సృష్టించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు అన్నారు. తాడిమళ్ల గ్రామంలో మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో అక్కడి ఆవ చెర్వులోకి 36 వేల చేప పిల్లలను ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు బుధవారం వదిలారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు చింతల సీతారామయ్య, స్థానిక నాయకులు తిరుమళ్ల దుర్గారావు, కాపకాయల సూర్యనారాయణ, మానుకొండ చంద్రబాబు, బయ్యే లక్ష్మణరావు, మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ బి.దేవానందం, సచివాలయ అసిస్టెంట్లు ఎ.రవి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా..

- పల్లెలు, పట్టణాల్లో సురక్ష వైద్య శిబిరాలు
- హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరు, నిడదవోలుతో సహా పలుచోట్ల సురక్ష వైద్య శిబిరాలు



కొవ్వూరు శిబిరంలో మందుల స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి వనిత



నిడదవోలులో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



నల్లజర్ల మండలం అయ్యవరంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేతలారి వెంకట్రావు

కొవ్వూరు: ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడిని నిజం చేస్తూ ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ సాధనకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. కొవ్వూరు మునిసిపల్ కార్యాలయం ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను మంత్రి వారిని అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు మంత్రి ఉచిత మందుల కిట్స్ అందజేశారు. ఈ వైద్య శిబిరంలో 645 మందికి కంటి,దంత, ఎముకలు, ఊపిరితిత్తుల, ప్రసూతి, జనరల్ వైద్య సేవలు అందించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, కమిషనర్ బి.శ్రీకాంత్, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

పెనకనమెట్టలో 566 మందికి..

పెనకనమెట్టలో దొమ్మేరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 566 మందికి వివిధ రకాల వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, సర్పంచ్ మేకా శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో జె.సంధ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ధర్మరాజు, సీహెచ్ దివ్య, జి.హరిశ్చంద్ర, డాక్టర్ ప్రణీత తదితరులు వైద్య సేవలు అందించారు.

దారవరంలో 439 మందికి..

చాగల్లు: మండలంలోని దారవరంలో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని ఆ పంచాయతీ సర్పంచ్ మద్దుకూరి రవిప్రసాద్ ప్రారంభించారు. బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీ వైద్యులు నిషిత, దేవి 439 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు ఊబా భాగ్యవతి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉండవల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అయ్యవరంలో 510 మందికి..

నల్లజర్ల: నల్లజర్ల పీహెచ్‌సీ పరిధిలోని అయ్యవరం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ గుడిశే వీరాస్వామి, ఎంపీటీసీ సభ్యురాలు మారుబోయిన సత్యవతి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరాన్ని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సందర్శించి, వైద్య సేవలను పర్యవేక్షించారు. శిబిరంలో గైనకాలజిస్టు ప్రత్యూష, ఈఎన్‌టీ షమీర్ రహమాన్, డాక్టరు సిరాజుద్దీన్, డాక్టరు వెంకట్రావు 510 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 26 మందిని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారు.

బందపురంలో 612 మందికి..

దేవరపల్లి: మండలంలోని బందపురం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. సర్పంచ్ కాత్రగడ్డ పరమేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇప్పటి వరకూ 34 వైద్య శిబిరాలు నిర్వహించి రెండు వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ శిబిరంలో వైద్యులు 612 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 16 మందిని ఉన్నత వైద్యం కోసం ఆరోగ్య శ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జి.రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు సొంటి కాశీవిశ్వనాథం, డాక్టర్ సాంబశివరావు, జె.అశ్వని సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పాలంగిలో 585 మందికి..

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ బొక్క శ్రీనివాసు ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఈ శిబిరాన్ని సందర్శించారు. వైద్య సేవలను పరిశీలించి, రోగులకు మందులను పంపిణీ చేశారు. శిబిరంలో ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ రాజనాల ప్రసాద్ ఆధ్వర్యంలో శాంతికమల (కంటి వైద్యురాలు), రవి కుమార్, ఉషాదేవి (జనరల్ సర్జన్లు) 585 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. 43 మందిని కంటి, 56 మందిని జనరల్ ఆపరేషన్ల నిమిత్తం ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు, పాలాటి శరత్‌బాబు, తహసీల్దార్ జి.కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

కోరుపల్లిలో 413 మందికి..

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుపల్లిలో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు ప్రారంభించారు. వేలివెన్ను పీహెచ్‌సీ డాక్టర్ వై.సృజన పర్యవేక్షణలో నలుగురు స్పెషలిస్ట్ వైద్యులు 413 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు ఆత్రేయపురపు రాజారావు, ఎంపీటీసీ సభ్యుడు ఈరి గంగారావు తదితరులు పాల్గొన్నారు.

ముక్కామలలో 519 మందికి..

పెరవలి: మండలంలోని ముక్కామల నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ కేతా త్రిమూర్తులు ప్రారంభించారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ శిబిరంలో 519 మందికి పరీక్షలు చేశారు. ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్సల నిమిత్తం 37 మందిని ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశామని డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు వేండ్ర ఏసు, ఎంపీటీసీ సభ్యులు గండేపల్లి రామకృష్ణ, వేండ్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో 664 మందికి..

నిడదవోలు: పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే రోగులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. వివిధ వైద్య విభాగాల్లో పేదలు పొందిన సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీలు ప్రదర్శించిన పోషకాహార స్టాల్‌ను పరిశీలించారు. రోగులకు ఉచితంగా మందుల కిట్లు పంపిణీ చేశారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి జి.హేనా నేతృత్వంలో వివిధ విభాగాల వైద్యులు ఈ.తేజశ్రీ , దిలీప్, ఎస్.శణ్ముఖశర్మ, బి. రవికిరణ్, ఎన్.శ్రీనివాసరావు, పీతల సత్య ప్రశాంతిలు 664 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం కోసం 22 మందిని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్‌పర్సన్ యలగాడ బాలరాజు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.